ప్రజా విశ్వంభర V3 NEWS

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో ప్రతి కుటుంబాన్ని భాగస్వామ్యం చేయాలి

నవంబర్ 19న ముఖ్యమంత్రి చేతుల మీదుగా
రాష్ట్ర వ్యాప్తంగా పథకం ప్రారంభోత్సవాలు
గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో రెండు వారాల పాటు ప్రత్యేక దరఖాస్తుల స్వీకరణ శిబిరాలు
ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించాలి
బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలి
సోషల్ మీడియా, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రతి ఇంటికీ పథకం సమాచారం చేరవేయాలి: సీఎస్ సంజయ్ జాజు

విశ్వంభర,సూర్యాపేట: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభు త్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశిం చారు.బుధవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సంద ర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సాయంత్రం సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించను న్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం జరిగే సమయంలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో కూడా పథకాన్ని ప్రారంభించాలని ఆదేశించారు.

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రారంభోత్సవాలు..

పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని, అన్ని ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిసమన్వయంతో పనిచేస్తూ ప్రారంభోత్సవకార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు.



ప్రతి గ్రామం, వార్డులో ప్రత్యేక శిబిరాలు..

పథకం ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి అందేలా రాబోయే రెండు వారాల పాటు గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు ఫారం సేకరించాలని, బీమా పొందే వ్యక్తి వివరాలతో పాటు నామినీ వివరాలను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.దరఖాస్తుల్లో అవసరమైన వివరాలన్నీ స్పష్టంగా, తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో అధికారులు ప్రత్యేక బాధ్యత తీసుకొని ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు అందేలా చర్యలు చేపట్టాలని, ఎవరూ నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా పర్యవేక్షించాలని సూచించారు.

ప్రచార కార్యక్రమాలను విస్తృతం చేయాలి..

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సీఎస్ తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికలను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కర పత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా పథకం వివరాలను ప్రజలకు తెలియజేయాలని, ప్రత్యేక శిబిరాల నిర్వహణ తేదీలు, ప్రదేశాల గురించి ముందుగానే ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి పథకం సమాచారం చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రచార కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి హరికింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, డిఆర్డిఓ సన్యాసయ, జడ్పీ సీఈవో శిరీష, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, డీఎస్ఓ మోహన్ బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించాలి

నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్

విశ్వంభర, మహబూబాబాద్: విద్యార్థుల్లో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు,భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల (జూజం) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయ ఎన్ ఐ సి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి విద్యార్థి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాధ్యతాయుత పౌరులుగా ఎదగడంతో పాటు ఎన్నికల ప్రక్రియలో చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు హక్కు ప్రాధాన్యత అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ఓటరు జాబితా తయారీ, సవరణలు, ఈవీఎంలు, వీవీప్యాట్, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై క్విజ్ పోటీల ద్వారా విద్యార్థుల అవగాహనను పరీక్షించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ భవిష్యత్తులోనూ ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.



పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా ఎన్నికల అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ యాదవ్, సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లాలో పకడ్బందీ చర్యలు

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

విశ్వంభర,మహబూబాబాద్:బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పథకం అమలు తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేయబోతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా ఇవ్వడం జరుగుతుందని, రేపు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో పకడ్బందీగా ఈ పథకం అమలుకు చర్యలు పక్క ప్రణాళిక తో ముందుకు సాగాలని ఎలాంటి పొరపాట్లు లేకుండా అధికారులు ప్రభుత్వం సూచించిన విధంగా జీవిత బీమాను అమలు చేయాలని, ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు సవివరంగా క్లుప్తంగా అందరికీ వివరించారు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా విస్తృత ప్రచారం కల్పించి, క్యాంపులు ఏర్పాటు చేసి ఎవరు ఎప్పుడూ హాజరు అయ్యేవిధంగా రూట్ మ్యాప్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని, ఏమైనా ఇబ్బందులు సమస్యలు ఏర్పడితే సంబంధిత మున్సిపల్, ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయలలో



సంప్రదించాలన్నారు, ప్రభుత్వ సూచనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం అమలు కోసం ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందని, తెలిపారు, ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, డిపిఓ రేవంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్లతో పేదల బతుకుల్లో వెలుగులు

విశ్వంభర, హనుమకొండ: వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 13 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూడా చైర్మెన్ గుండు సుధారాణి , హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న ల తో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 13 డివిజన్లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు నూతనంగా చేయూత పింఛన్లు మంజూరు కావడం సంతోషకరమని అన్నారు.పింఛన్లు వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు నెలవారీ ఆర్థిక భరోసాగా నిలుస్తాయని తెలిపారు.గతంలో పెన్షన్ల కోసం అర్హులైన ఎంతోమంది ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు.నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పేదల ముఖాల్లో చిరునవ్వు చూడటమే



ప్రజాప్రతినిధిగా తన లక్ష్యమని ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు అన్నారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామశాఖ అధ్యక్షులు, డివిజన్ల ముఖ్య నాయకులు, జిల్లా సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్ బాధితుల కోసం ప్రత్యేక సెల్, 24 గంటల హెల్ప్‌లైన్ కావాలి

విశ్వంభర, లకిడికపూల్: అక్రమ లోన్ యాప్ వేధింపులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ గారు శ్రీ సీవీ ఆనంద్కి ఎఐఎస్ వో టీజీ వారు వినతి పత్రం అందచేశారు. నవంబర్ 2026లో కానిస్టేబుల్ ఆత్మహత్య, సెప్టెంబర్ 2026లో బోడుప్పల్ మహిళను ఆమె మైనర్ కుమార్తె మార్ఫింగ్ ఫోటోలతో బెదిరించిన ఘటనలను ప్రస్తావిస్తూ.



1.సైబర్ క్రైమ్ విభాగంలో ప్రత్యేక సెల్
2.కౌన్సెలింగ్‌తో 24 గంటల టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ (వాయిస్ + వాట్సాప్)
3.మార్ఫింగ్ ఫోటోలు, మైనర్లు, ఆత్మహత్య సంకేతాల కేసులకు ప్రాధాన్యం
4.వెంటనే ఎఫ్ఐఆర్ లు, ఖాతాల స్తంభన, నిర్వాహకులు, కాల్ సెంటర్ యజమానుల అరెస్టు
5.ఆర్బీఐ గూగుల్ ప్లే, బ్యాంకులు, ఎంఈఐటీవోతో కలిసి అక్రమ యాప్‌ల నిలిపివేత; తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్‌లో అవగాహన కార్యక్రమలు చేయవలిసిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో ఏఐ ఎన్ ఓ-టీజీ రాష్ట్ర నాయకులు జీజ రమేష్ కుమార్, వీరారెడ్డి, ఎండీ సమీర్, గడ్డం ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సెస్ నిధులు వారికే ఖర్చు చేయాలి

విశ్వంభర, రామన్నపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేస్తున్న సెస్ నిధులను ఇతర పథకాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమానికే వినియోగిం చా లని భవన నిర్మాణ కార్మిక సం ఘం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగే సోములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామ



న్న పేట మండల కేంద్రంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికుల నిధులను ఇతర పథకాలకు మళ్లించడం అన్యాయమని విమర్శిం చారు. ప్రమాద బీమా, విద్య, వైద్యం తదితర సంక్షేమ పథకాలను కార్మికులకు సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును బలోపేతం చేసి, సెస్ నిధులను కార్మికుల భద్రత, సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. నిధుల మళ్లింపు ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, అప్పం సురేందర్, మండల అధ్యక్షుడు వంగాల మారయ్య, కార్యదర్శి బుడ్డ ప్రసాద్, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మరణించిన కుటుంబానికి అండగా నిలిచిన పులి పలుపుల రాములు గౌడ్

విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మం డల పరిధిలో మొగిలిపాక బాధిత కుటుంబానికి అండగా నిలిచిన పులిపలుపుల రాములు గౌడ్.మొగి లిపాక గ్రామానికి చెందిన కే.శే. జడిగే సత్తమ్మ ,అకాల మరణం గ్రామంలోతీవ్ర విషాదాన్ని నింపిం ది. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఘన నివా



ళులు అర్పిస్తున్నాము.పదవి ఉన్నా లేకపోయినా.. కష్టకాలంలో ప్రజల చెంతనే ఉండి భరోసా ఇవ్వడమే అసలైన ప్రజాసేవ అని మరో సారి నిరూపించారు పి వై ఎస్ ఫౌండేషన్ అధినేత పులిపలుపుల రాములు గౌడ్ . సత్తమ్మ , మరణవార్త విన్న వెంటనే రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో స్పందించిన ఆయన.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా హైదరాబాద్ నుండి నేరుగా మొగిలిపాక గ్రామానికి చేరుకున్నారు .పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, అంత్యక్రియల నిమిత్తం రూ. 5,000/- వేలు తక్షణ ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచారు. అంతేకా కుం డా, కేవలం పరామర్శించి వెళ్లిపోకుండా స్వయంగా సత్తమ్మ , అంతిమయాత్రలో పాల్గొని తన పెద్దమనసును, గ్రామ ప్రజలపై తనకున్న ఆత్మీయతను చాటుకున్నారు. ప్రజా సేవలో ఎప్పుడూ ముందుంటూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్న పులిపలుపుల రాములు గౌడ్, సేవా గుణాన్ని అగ్రనాయకులు, గ్రామస్తులు ఎంతగానో అభినందిస్తున్నారు.

నెల్లికుదురు మండల ఆర్యవైశ్య సంఘం కమిటీ ఏకగ్రీవం



విశ్వంభర,నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రం నెల్లికుదురు లో మండల ఆర్యవైశ్య సామాజిక వర్గం సమావేశమై సం బంధిత మండల కమిటీని ఎంపిక చేశారు. ఆర్యవైశ్య సంఘం మం డల అధ్యక్షులుగా పెన్నాకుల ఉపేం దర్, గౌరవ అధ్యక్షులుగా వెన్నాకుల పెద్ద శ్రీను,కార్యదర్శిగా మాసెట్టి నవీన్ కుమార్, కోశాధికారి బచ్చు నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు నాళ్ళ శ్రీనివాస్, గుమ్మడవెల్లి మనోహర్, సహాయ కార్యదర్శిలు చీమకుర్తి రమేష్,మాడుగుల వీరన్న నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శీలం సోమన్న,టి.వాసు, గోరంట్ల గణేష్,వేషాల నాగన్న,సలహాదారులు గా కొండె సత్యనారాయణ,నంగునూరు శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు ఉపేందర్, మాసెట్టి నవీన్ కుమార్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల హక్కులు,సమస్యల పరిష్కారానికి కమిటీతోపాటు,సీనియర్ ఆర్యవైశ్య సంఘ నాయకుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు.తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య సామాజిక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు రాజుగా మారినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యం

జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాప సభ్యులు కొనగల రమేష్...

విశ్వంభర, జనగామ: దేవరుప్పుల, మండలంలోని ధర్మపురం, మస్నద్, గ్రామాలలో జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాప సభ్యులు కొనగల రమేష్ బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలు, పాలకవర్గం వారికి డబ్బు చప్పులతో ర్యాలీతో ఘనంగా స్వాగతం పలికారు.గ్రామం లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు అరుగాలం



పండించిన పంటను అమ్మగా వచ్చిన డబ్బులను మధ్య దళారులు గంటలోనే సంపాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తము పండించిన పంటలను క్వింటాల్ కొద్ది అమ్మకం చేసి, కిలోలు కొద్దిగా కొనుగోలు చేయడం బాధాకరమన్నారు.రైతులు ఉత్పత్తిదారులుగా మారినప్పుడే రైతు బాగుపడతాడు అని తెలిపారు.గ్రామంలోని జీవనోపాదులు ఉపాధి అవకాశాలపై మహిళలు, రైతులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో, ఆయా గ్రామాల సర్పంచులు దొపాటి అశ్విని – రవి, పారిపెల్లి బాలమ్మ- శ్రీనివాస్, సంస్థ రాష్ట్ర అధ్యక్షులు, కన్నారపు పరుశరాములు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ అంగిరేకుల శ్రీకాంత్, జనగామ జిల్లా కన్వీనర్ గాదేపాక శ్రీనివాస్, కో- కన్వీనర్లు తోడేటి ఆంజనేయులు, ఎండి రబియా, దేవరుప్పుల మండల ఎస్ఎంఐ సభ్యులు బోనగిరి యాకస్వామి, పి సరూప, మహిళలు, రైతులు, యువకులు, పెద్ద ఎత్తున, పాల్గొన్నారు.

మాలాధారులందరికీ ప్రతి బుధవారం అన్నదానం

విశ్వంభర,సూర్యాపేట: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ దేవాలయంలో ప్రతి బుధవారం మాలాధారణ చేసిన స్వాములందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించను న్న ట్లు ఆలయ అధ్యక్షుడు అనంతుల గణేష్ రామలింగయ్య తెలిపారు. బుధవారం దాతల సహకారంతో



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలాధారణ చేసిన స్వాములందరికీ అన్నదానం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. దాతల సహకారంతో కార్తీకమాసం మొత్తం ప్రతి బుధవారం అన్నదాన వితరణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనంతుల సూర్యనారాయణ, అనంతుల సందీప్ కుమార్, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిరంజీల కొరతతో రోగుల అవస్థలు
నెల రోజులుగా పీహెచ్‌సీల్లో సిరంజీల కొరత..
బయట కొనుక్కురావాలని వైద్యుల సూచన



విశ్వంభర, సిరిసిల్ల : సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిరంజీల కొరత రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గత నెల రోజులుగా పలు పీహెచ్‌సీల్లో సిరంజీలు అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం వచ్చే రోగులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్య నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిరంజీలు లేవని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజక్షన్ చేయించుకోవడానికి ఆసుపత్రికి వెళ్తే బయట మెడికల్ షాపులో సిరంజీలు కొనుగోలు చేసి తీసుకురావాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందాల్సిన వైద్య సేవల కోసం సైతం రోగులు తమ జేబుల్లో నుంచి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీస వైద్య పరికరమైన సిరంజీలు కూడా అందుబాటులో లేకపోవడంపై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు స్పందించి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరిపడా సిరంజీలను సరఫరా చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని వైద్య సామగ్రి, సదుపాయాలను అందుబాటులో ఉంచాలని రోగులు కోరుతున్నారు.